



‘‘అమ్మా, పాలండీ, పాలు తీసుకోండి.”

పాలామె కేకలతో అనురాగ్‌కి మెలకువ వచ్చింది. కానీ లేవడానికి ఎంతో బద్ధకం వేసింది. రాత్రి అతనికి ఎంతో ప్రయత్నించిన మీదట కానీ నిద్ర పట్ట లేదు. పక్కమీద అట్నించి ఇటూ, ఇట్నుంచి అటూ దొర్లీ, దొర్లీ ఎంతో

సతమతమయ్యాక ఎప్పుడో తెల్లవారు ఝామున నాలుగింటికి నిద్రపట్టింది. మరో గంటలో పాలామె తయారయింది. వాళ్ళింట్లో తనే రోజూ పాలు తీసుకుంటాడు. పాల పేకెట్ తీసుకున్నాక, రోజూలాగే కేలెండర్‌లో తారీఖు ఛేంజ్ చేశాడు. ఆ రోజు ఆగష్టు 8వ తారీఖు.

అవును. ఆగష్టు 8వ తారీఖు.... తనకు వివాహమయిన రోజు. తన జీవితంలోని కష్టసుఖాలని, చీకటివెలుగులనీ పంచుకునేందుకు భాగస్వామిని ప్రవేశించిన రోజు.

8 వ తారీఖున పెళ్లి, 9 వ తారీఖున తన పెళ్ళికూతురింట్లో రిసెప్షన్- అంతా బాగా జరిగాయి. 11 వ తారీఖున రాజమండ్రి నుంచి శ్రీ సింహాచలయాత్ర, తర్వాత ఊటీకి శృంగారయాత్ర అన్నీ సినిమాలోని రీళ్ళలాగ ఎంతో చప్పున జరిగిపోయాయి.

కానీ, జరగవలసిందే జరగలేదు. శృంగారయాత్రలో ప్రతి భర్తా ఎంతో ఆశతో ఎదురుచూసే అనుభవాలు, అనుభూతులు తనకి ఎంతమాత్రం కలగలేదు!

అలా అని, సంధ్యకి తనమీద ప్రేమ లేదు అని అందామనుకుంటే, వీల్లేదు. తనకి కావలసినవన్నీ స్వయంగా ఆమే చూసేది. పెళ్ళైన ఈ ఏడాదిలో తనకి సేవలు చెయ్యడంలో ఎప్పుడూ నిర్లక్ష్యం చెయ్యలేదు.

ఆ మాటకొస్తే ప్రతీ భార్యా తన భర్తకి సేవలు చేస్తుంది. కానీ, సంధ్య విషయంలో అట్లా కాదు. కేవలం తన భర్తకి సేవచెయ్యడమే జీవితాశయమన్నట్లు ప్రవర్తించేది.

కానీ, ఈ ఏడాదిలో తను ఎన్నిసార్లు, ఎంత ప్రయత్నం చేసినా, తనూ, సంధ్యా- ఇంకా ఏకమవలేదు. ఈ విషయంలో అతని ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరైనాయి. కట్టుకున్న మొగుడ్ని ముట్టుకోనిచ్చేది కాదు, పట్టుకోనిచ్చేదికాదు సంధ్య.

అనురాగ్ చిన్నప్పట్నించీ ఆశావాది. తన భార్య 'సెక్స్' విషయంలో చూపిస్తున్న విముఖత త్వరలో మాయమవుతుందనీ, అందరి స్త్రీలలాగే ఆమె కూడా దాంపత్యజీవితంతో పాల్గొనేందుకు ఏదో ఒకరోజు ఉత్సాహం చూపిస్తుందని అతనికి గట్టి నమ్మకం. కానీ, ఎంతటి ఆశావాదికైనా సుదీర్ఘమైన ప్రయత్నం ఫలించకపోతే, అప్పుడప్పుడు క్షణికమైన నిరాశా, నిస్పృహ కలగడం సహజం. ఆ క్షణం తర్వాత ప్రయత్నాల్ని మరింత పట్టుదలతో సాగించడం కూడా సహజమేమో!

అనురాగ్ పరిస్థితి ఇంచుమించు అలాగే ఉంది ఆ రోజు. ఎలాగైనా ఈ రోజు తాడో, పేడో భార్యతో తేల్చుకోవాలనుకున్నాడు.

అప్పుడే ఉదయం ఏడయింది. వెంటనే

కాలకృత్యాలన్నీ తీర్చుకుని, పాలు కాచి నెస్‌కాఫీ రెండు కప్పులలో పోసి, భార్యని తట్టి లేపాడు. రేడియో ట్యూన్ చేశాడు. అప్పుడే వివిధభారతిలోంచి తెలుగు పాటలు ప్రారంభం.

'లేవండోయ్, శ్రీమతిగారూ–' సీతారాములు సినిమాలోంచి పాట వస్తోంది. ఎందుకో అనురాగ్‌కి శుభసూచకం అన్పించింది.

శ్రీమతికి శుభోదయం అంటూ సంధ్యని "విష్" చేశాడు. ఆమెచేత నెస్ కాఫీ తాగించాడు.

"ఇదేమిటి నేను మీకు తీసుకురావలసింది పోయి, మీరు తీసుకొచ్చారు కాఫీ? అసలు, ఎందుకో ఇవాళ నాకింత నిద్ర పట్టేసింది."

కాఫీ ఎవరు తెస్తే ఏం సంధ్యా? ఈ రోజు నన్ను నీకు సేవలు చేయనీ. ఈ ఒక్కరోజే సుమా! మళ్ళీ రేపట్నించి అంతా మామూలే!"

"అదేమిటి?అలా మాట్లాడుతున్నారు?"

"సంధ్యా, నీకు జ్ఞాపకం లేదేమో! ఈ రోజే ఆగష్టు 8 వ తారీఖు. నా జీవిత భాగస్వామినిగా నువ్వు ప్రవేశించి ఒక ఏడాది పూర్తయింది. ఈ రోజు వంటా, వార్పు ఏమీ పెట్టుకోకు."

"మరి మన వెడ్డింగ్ ఏనివర్సరీ రోజున నా చేతులతో వంటచేసి, మీకు విందుభోజనం పెట్టాలని ఉండదా నాకు."

"సంధ్యా, నేను ఇంకోసారి చెప్తున్నాను. ఈ రోజు నువ్వు వంట చెయ్యడంలేదు. మనం త్వరలోనే బయటికి వెళ్తున్నాం."

"అది కాదండీ–"

"సంధ్యా, నువ్వేమీ చెప్పొద్దు ఇంక. భర్త హోదాలో నేను నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను." అనురాగ్ మాటలలో ఆమెకి మొట్టమొదటిసారి కాఠిన్యం వినిపించింది.

* * *

మధ్యాహ్నం కోటి దగ్గరున్న గుజరాతీ హోటల్‌లో భోజనం చేశాక సంధ్యా, అనురాగ్ సినిమా చూసి ఇంటికి చేరుకున్నారు. ఒక గంటసేపు విశ్రాంతి తీసుకుని, మళ్ళీ బయటకు వెళ్దామన్నాడు అనురాగ్. సంధ్య మౌనంగా భర్తను అనుసరించింది. వెంటనే ఆటో ఎక్కి పబ్లిక్‌గార్డెన్స్ చేరుకున్నారు.

"సంధ్యా! అంతా సవ్యంగా జరుగుంటే, ఈ రోజు మా ఫ్రెండ్సందర్నీ పిలిచి పార్టీ ఇచ్చిఉండేవాడిని. కానీ, మన జీవితం ఎందుకో సవ్యంగా జరగడం లేదు. అసలు నిజం చెప్పాలంటే, మన జీవితం ఇంకా ప్రారంభమవలేదు.

"ఎందుకీ మౌనం సంధ్యా? అసలు మన జీవితం ప్రారంభమవుతుందా? లేకపోతే ఎప్పుడూ ఇంతేనా?"

"అనురాగ్!"

"సంధ్యా, చెప్పు సంధ్యా! మన పెళ్ళై ఏడాదయిపోయింది. మిగిలిన

విషయాలమాటెల్లా ఉన్నా, ఒక్కమాట చెప్తున్నాను విను. ప్రతి స్త్రీకీ 'అమ్మా' అని తన బిడ్డలచేత పిలిపించుకోవడం ఎంత సరదాగా ఉంటుందో, అదే విధంగా ప్రతి మగవాడికి 'నాన్నా' అని పిలిపించుకోవాలని ఉంటుంది. నా మీద కొంచెమైనా సానుభూతి చూపించి, నువ్వు నాకా అనుభూతిని ఇవ్వాలి."

"సారీ, అనురాగ్. ఇన్నాళ్ళు మిమ్మల్నెంతో కష్టపెట్టాను. కానీ, అంతకంటె కనీసం పదిరెట్లు మానసికంగా యాతనని అనుభవించాను."

"సంధ్యా, అదేమిటి?"

"అదేమిటి అంటే, అది అంతే! సరే, మిమ్మల్నొక విషయం అడగనా?"

"ఏమిటో, అది? అడుగు సంధ్యా!"

"మన ఫస్ట్ వెడ్డింగ్ ఏనివర్సరీకి మీరు నాకిచ్చే ప్రెజెంట్ ఏమిటి?"

"నీకేం ప్రెజెంట్ కావాలంటే అది అడుగు సంధ్యా. కావాలంటే నా ప్రాణాలయినా ఇస్తాను."

"మీ ప్రాణమా? మీ ప్రాణం తీసుకుని నేనేం చెయ్యాలి? నాకు కావల్సింది మీరు సంతోషంగా ఉండడం. సరే, నాకు కావల్సిందేమిటో నేనే చెప్తాను. నాకు మీ దగ్గర్నుంచి విడాకులు కావాలి."

"సంధ్యా" గట్టిగా, కోపంగా అరిచాడు అనురాగ్.

"అనురాగ్, నన్ను క్షమించండి. నాకు విడాకులు కావాలి."

"సరే సంధ్యా- నీ కంతగా అలాగే జరగాలని ఉంటే, అలాగే మనం విడాకులు తీసుకుందాం. కానీ, మన వెడ్డింగ్ ఏనివర్సరీ రోజున, నువ్వుకూడా నాకొక ప్రెజెంట్ ఇవ్వాలి. ఇన్నాళ్ళు నన్ను నీ దగ్గరికి ఎందుకు రానివ్వలేదో నువ్వు చెప్పు. అంతా విన్నాక, మన వైవాహిక జీవితం ఇంక సాగదు అని అనుకుంటే తప్పకుండా విడిపోదాం."


"చెప్పి తీరాలా."

"అవును, సంధ్యా! నువ్వంతా చెప్పాలి. ఈరోజు మన జీవితంలో మరో కొత్త అధ్యాయం ప్రారంభమవ్వాలి. లేదా ప్రారంభమయి తీరుతుందని నా నమ్మకం."

* * *

"మా నాన్నగారు మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా విశాఖపట్నంలో పనిచేసేవారు. మహారాణిపేటలో మాకో పెద్ద ఇల్లుండేది. ఆ బంగళా కివతల ఒక చిన్న ఔట్‌హౌస్."

"ఔట్‌హౌస్ అంటే అది పేరుకు మాత్రమే ఔట్‌హౌస్. నిజానికి అది ఎంతో బావుంటుంది. ముందర ఒక చిన్న గ్రిల్లు. ఆ తర్వాత ఒక గది, కిచెన్. గదికి ఒక బాత్‌రూమ్ ఎటేచ్‌చేసి ఉంది. ఇంక కిచెన్‌లో వంట చేసుకునేందుకు అవసరమైన మోడరన్ ఫెసిలిటీస్ అన్నీ ఉన్నాయి.




మా బంగళా కట్టిన కొన్ని రోజుల్లోనే బొంబాయినుంచి వెంకట్రావుగారనే అసిస్టెంట్ ఇంజినీరుకి మా ఊరికి బదిలీ అయింది. వెంకట్రావు ఇంచుమించు ఏడడుగుల పొడగు. ఆ పొడుగుకి తగ్గ లావు. ఎంతో మంచి పర్సనాలిటీ అన్న మాట. అప్పటికే నా బి.ఎస్‌సీ. పూర్తయింది. మా ఫాదర్ నా పెళ్లి ప్రయత్నాలలో ఉన్నారు. వెంకట్రావుని చూడంగానే ఆ భగవంతుడు దివినుంచి భువికి నాకోసం పంపించిన పెళ్ళికొడుకు అని అన్పించింది నాకు. మా నాన్నగారు నన్ను వెంకట్రావుకి పరిచయం చేశారు. మా పరిచయం, స్నేహం రోజురోజుకీ ఎక్కువయ్యాయి. ఇద్దరి మధ్యా హద్దులు రద్దయ్యాయి. చివరికొక రోజు మా ఔట్‌హౌస్‌లోనే అంతా అయిపోయింది. నేను గర్భవతిని అయ్యాను.

నెమ్మదిగా ఈ విషయం మా నాన్నగారికి తెలిసింది. ఆ పరిస్థితులలో ఏ తండ్రిమట్టుకు ఏం చెయ్యగలడు? మా పెళ్ళి గురించి మా నాన్న వెంకట్రావుతో మాట్లాడాడు. ఇంక మా పెళ్ళికి ఏ అటంకాలు లేనట్లే. తన చెల్లెలు పెళ్ళి ఆ వచ్చే నెలలో జరుగుతుందనీ, చెల్లెమ్మ పెళ్ళి అయేదాకా మా పెళ్ళి ఆపాలని మట్టుకు ఒక షరతు పెట్టాడు. అంతదాకా మా పెళ్ళిగురించి అందరికీ తెలియకూడదని మరో షరతు. మా నాన్నగారు ఈ రెండు కండిషన్స్‌కి ఎంతో సంతోషంగా ఒప్పుకున్నారు.

ఇంకో వారం రోజులయ్యాక, వెంకట్రావు తన చెల్లెలు పెళ్ళి కుదిరిందని మా నాన్నగారికి చెప్పడాని కొచ్చాడు. అప్పటికి మా నాన్నగారికి వెంకట్రావు

మీద ఎంతో ప్రేమా, గౌరవం ఏర్పడ్డాయి. ఇంటల్లుడికి జరపాల్సిన గౌరవమర్యాదలన్నీ వెంకట్రావు పొందేవాడు. చైతన్య పెళ్ళికి ఇంకో పదిహేను రోజులు మాత్రమే ఉంది. పెళ్ళికి నన్నుకూడా తనతో పంపమని, తన చెల్లెలు పెళ్ళిలో నన్ను తనవాళ్ళందరికీ పరిచయం చేస్తానని మా నాన్నని అడిగాడు వెంకట్. మిలిటరీలో పనిచేస్తూ ఉండడంవల్ల, తర్వాత వెంకట్రావు మీదుండే ప్రత్యేక ప్రేమానురాగాలవల్ల మా నాన్న నన్ను వెంకట్రావుతో వెళ్ళనిచ్చారు. విశాఖపట్నంనుంచి హైదరాబాదుదాకా బస్సులో వెళ్ళి, అక్కడ్నించి బొంబాయికి రైళ్ళో వెళ్ళాం. చైతన్య పెళ్ళి ఎంతో ఘనంగా జరిగింది. వెంకట్రావు, చైతన్యల తల్లీ, తండ్రి నన్ను ఎంతో అప్యాయతతో ఆదరించారు. మా పెళ్ళికి తారీఖుకూడా నిర్ణయించేశారు.

నేను, వెంకట్రావు బొంబాయినుంచి విశాఖపట్నం బయలుదేరాం. వచ్చేటప్పుడు వెంకట్రావు ఎంతో మంచి మూడ్‌లో ఉన్నాడు. ఫస్ట్‌క్లాసులో బెర్త్స్ రిజర్వ్ చేశాడు. షోలాపూరు దాకా సికింద్రాబాదు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం హాయిగా జరిగింది.

రైలు షోలాపూర్ స్టేషన్‌ని విడిచి పెట్టి వెళ్ళింది. మరో ఇరవై నిముషాల య్యాక, వెంకట్రావు టాయిలెట్‌కి వెళ్దామని తలుపులు తీశాడు. అంతే మా ఇద్దరికీ పక్కనే ఉన్న కూపే కంపార్ట్‌మెంట్‌లోంచి ఎంతో బిగ్గరగా అరుపులు వినపడ్డాయి. అక్కడికి వెళ్తే ఎంతో భయంకరమైన దృశ్యం మేము చూడాల్సొచ్చింది. అందులో ప్రయాణం చేస్తున్న యువకుడు తన భార్య బంగారంకోసం, ఆ బంగారం కంటె ఎంతో విలువైన తన భార్య ప్రాణం కోసం నలుగురు దొంగలతో హోరాహోరీ యుద్ధం చేస్తున్నాడు. కానీ వాళ్ళు నలుగురు, ఇక్కడ ఇతను ఒక్కడే కదా! వెంటనే వెంకట్రావు రంగంలోకి దిగాడు. తన తోటిమనిషికి సాయశక్తులా సహాయం చెయ్యాలని ప్రయత్నించాడు. ఈ సంఘర్షణలో తన ప్రాణాల్ని కూడా పోగొట్టుకున్నాడు.

"అంటే ఏ మనిషినైతే నే మనసారా ప్రేమించానో, ఏ వ్యక్తి ప్రతిరూపం నా శరీరంలో పెరుగుతోందో, ఆ వ్యక్తి మరణాన్ని అందులో దారుణమైన మరణాన్ని చూడవలసి వచ్చింది. ఇంతకంటె జీవితంలో భయంకరమైన అనుభవం ఏముంటుంది చెప్పండి, అనురాగ్!"

"నిజమే సంధ్యా- అలాంటి అనుభవం పగవాళ్ళకైనా వద్దనిపిస్తుంది. భయంకరమైన ఆ సంఘటనని నువ్వు ఎలా తట్టుకోగలిగావు!" ఆశ్చర్యంగా ఆందోళనతో అడిగాడు అనురాగ్.

"ఓ ఆర్నెలలు నేను నా గదిలో తలుపులు వేసుకుని ఒంటరిగా పడుకునే



యువ

దాన్ని. అఖరికి నన్ను కంటికి రెప్పలా చూసుకునే మా నాన్నని కూడా 'ఎవా యిడ్' చేసేదాన్ని. ఇదంతా చూశాక, మా నాన్న మనసు ముక్కలైంది. గుండె బద్దలయింది. తనకోసమైనా మళ్ళీ నన్ను మామూలు మనిషి అవమని చెప్పే వారు. సరే ఆయనకోసం బ్రతకాలనీ, కనీసం బ్రతకడానికి ప్రయత్నం చేస్తు న్నట్లు ఆయన కనిపించాలనీ నేనుకూడా ఆరాటపడేదాన్ని. ఇదిలా ఉండగా నాకు 'ఎబార్షన్' జరిగింది.

'ఏది జరిగినా మన మంచికేనమ్మా' అని అనేవారు మా నాన్న. ఆయన ప్రోత్సాహంతో నేను ఓ స్కూల్లో టీచరుగా చేరాను. మా నాన్నగారు నన్ను మళ్ళీ పెళ్ళిచేసుకొమ్మనేవారు.

"అమ్మా, సంధ్యా- నీ కింకా పాతి కేళ్ళుకూడా నిండలేదు. ఎబార్షన్ అయి పోయింది. అలా అవకుండా నీకో బిడ్డ పుట్టిఉంటే, ఆ బిడ్డలో నీ వెంకట్రావుని ఊహించుకుంటూ నీ జీవితాన్ని గడప వచ్చు. నీకు జీవితంలో ఓ తోడు ఉండాలి. ఎన్నోసార్లు ఆయన నాకు నచ్చచెప్పేవారు.

'నాన్నా,నాకు మళ్ళీ పెళ్ళిచేసుకోవడం ఇష్టంలేదు. నన్నిలాగే బ్రతకనివ్వండి' అనేదాన్ని నేను.

'కాదమ్మా, వెంకట్రావుతో నీకు పెళ్ళవలేదు. మీ ఇద్దరి మధ్యా ఉన్నది కేవలం ప్రేమానురాగాలే. మీరు తొందర పడి ఉండకపోతే ఏ గొడవా ఉండేది కాదు.' ఇలా ఎంతో పట్టుదలతో వాదించి నా చేత పెళ్ళికి ఒప్పించారు. కానీ నా మనస్సులో వెంకట్రావు, అతని జ్ఞాప కాలు ఇంకా అలాగే ఉన్నాయి. అయితే, మీరంటే నా కెంతో గౌరవం, అరాధన. అందుకే నా శాయశక్తులా మీకు ఈ సంవత్సరమంతా సేవ చేశాను. కానీ, మీతో దాంపత్య జీవితానికి నా మనస్సు ఒప్పుకోవడంలేదు."

"నీ కథంతా విన్నాను. మరి నా కథ చెప్పనా? తర్వాత కూడా విడాకులు కావా లంటే, అలాగే చేద్దాం."

"మీ క్కూడా ఓ కథ ఉందా? అయితే చెప్పండి." ఆమె కళ్ళలో ఓ వింత వెలుగు అనురాగ్‌కి మొదటిసారి కన్పించింది.

"అవును. మనది ఇద్దరిదీ రిజిస్టర్డ్ మేరేజ్ అవడంవల్ల, ఇంతకుముందర నా జీవితంలో జరిగిన ఎన్నో దురదృష్ట కరమైన సంఘటనలవల్ల నిన్ను మా ఇంటికి తీసుకెళ్ళలేదు. ఇప్పుడు నీ కెన్నో విషయాలు చెప్పాలి."

"చెప్పండి, శ్రద్ధగా వింటాను."

"సంధ్యా! మే మిద్దరం అన్నదమ్ము లం. నాకు ముగ్గురు అక్కలు. అంద ర్లోకి నేనే చిన్నవాణ్ని. నాన్నగారిక్కి అమ్మ అంటే ప్రాణం. నా దురదృష్ట వశాత్తూ, నేను ఈ భూమిమీద అడుగు పెట్టిన మరుక్షణంలోనే ఆమెకు ఆ

భగవంతుడినుంచి పిలుపు వచ్చింది. తల్లిని పొట్టన పెట్టుకున్నాననేమో మా నాన్నగారికి నా మీద ఒక విధమైన విముఖత ఏర్పడింది. నా మీద ఆయనకి రోజురోజూ కోపం, అసహ్యం ఎక్కువయిపోయేవి. నేను ఏ చిన్న పొరపాటు చేసినా, నాకు దేహశుద్ధి చేసేవారు."

"అయితే, అబ్బాయిగారి శరీరం చాలా గట్టిపడిందన్నమాట."


"ఆ, మా నాన్నగారి దయవల్ల నిజంగా నా శరీరం మొద్దుబారిపోయింది. కానీ మా అక్కలు ముగ్గురూ కూడా నన్నెంతో ప్రేమగా చూసుకునేవారు. పాపం, వాళ్ళు మా నాన్నగారికి కూడా నా గురించి నచ్చచెప్పడానికి ఎంతో ప్రయత్నం చేశారు. ఒక్కొక్కప్పుడు ఆయనకి కూడా తన ధోరణి వింతగా అనిపించేది.

'ఎందుకు అనురాగంటే నా కింత నిర్దాక్షిణ్యం? బహుశా పూర్వజన్మలో వీడు నా శత్రువయి ఉంటాడు. ఇలా బాధపడేవారాయన అప్పుడు. ఆ కాసేపు నన్ను కొంచెం ప్రేమగా చూసుకునేవారు. కానీ, ఆ తర్వాత మళ్ళీ మామూలే."

"మూడు నాలుగేళ్ళ తేడాలో మా అక్కలు ముగ్గురికీ పెళ్ళిళ్ళు చేసేశారు మా నాన్నగారు. తర్వాత మా అన్నయ్య పెళ్ళికూడా అయిపోయింది. నాకు అక్కలులేని లోటును మా వదినమ్మ కొంతవరకు తీర్చింది.

"కానీ మరికొన్ని నెలల్లోనే మా పెద్ద బావ ట్రెయిన్ ఏక్సిడెంటులో చచ్చిపోయాడు. మా చిన్నక్క మొగుడు బేంక్ మేనేజర్. ఒక రోజున పొరపాటున అరవై వేల రూపాయల చెక్‌ని ఎవరో ఫోర్జరీ చేసి, తీసుకువస్తే, అది దొంగ సంతకం అని గుర్తించక ఆ చెక్ పాస్ చెయ్యడం జరిగింది. వెంటనే వాళ్ళు మా రమేష్ బావని సస్పెండ్ చేశారు. మొత్తం అరవై వేల రూపాయల నష్టాన్ని రమేష్ భరించాల్సి ఉంటుందని ఒత్తిడి తీసుకురావడం మొదలు పెట్టారు. ఈ పరిస్థితులలో రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడు.

సరే, శాంతక్క పరిస్థితి ఇంకా అధ్వానం. పెళ్ళయిన రెండు, మూడు నెలల దాకా ఆమె భర్త సత్యనారాయణ సకలగుణాభిరాముడన్న విషయం మాకు తెలియదు. మా శాంత తన భర్తలోని లోపాల్ని ఓర్పుతో సహించి, నేర్పుతో అతడ్ని మామూలు మనిషిని చేయడానికి ప్రయత్నించేది, కానీ, ఫలితం శూన్యం. మా శాంతమ్మ మంచితనాన్ని అసరాగా చూసుకుని పుట్టింటి నుంచి డబ్బు తీసుకురమ్మనమని అక్కని వేధించేవాడు. కానీ, అన్ని వేలరూపాయల కట్నం గుమ్మరించాక కూడా, చీటికీ, మాటికీ డబ్బు కావాలని మమ్మల్ని వేధిస్తే, మేము మటుకు ఎక్కడ్నించి తెస్తాం డబ్బు? ఆయన గారి కోరికలు




తీర్చలేక పోతే, మా అక్కని దారుణంగా హింసించేవాడు. ఈ అత్యాచారాలని భరించలేక చివరికి మా అక్కే ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయింది.

"మరి కొన్ని రోజులలో మా వదినమ్మ కేదో విషజ్వరం రావడం, ఆమె కూడా ఆ దేవుడి సన్నిధికి చేరుకోవడం జరిగింది. మరో ఆర్నెల్లలో మా అన్నయ్య మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు.

"అంటే, మీ ముగ్గురు అక్కలలో ఎవరూ కూడా జీవితంలో ఎక్కువగా సుఖాన్ని పొందలేదన్నమాట."

"అవును, సంధ్యా! పువ్వులా నవ్వుతూ, కోకిలలా పాడుతూ ఉండవలసిన సమయంలో ఇద్దరు అక్కలు విధవలయ్యారు. మూడవ అక్క ఈ ప్రపంచంనుంచే నిష్క్రమించింది."

"ఇవన్నీ అయ్యాక, ఎందుకోగానీ మా నాన్నగారికి నా మీద అసహ్యం కొంచెం కొంచెం తగ్గడం మొదలైంది. ఇంటికి సంబంధించిన అన్ని విషయాలలో నన్ను ఇప్పుడు సంప్రదిస్తున్నారు. నా చదువు కూడా పూర్తయింది. ఇప్పుడు నేను ఒక ప్రైవేటు కంపెనీలో పెద్ద ఇంజినీర్ని.

"నాకు ఎన్నో సంబంధాలు వచ్చేవి. నా మీద మా నాన్న ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, లక్షలు లేకపోయినా సలక్షణమైన అమ్మాయిని నా ఇంటి లక్ష్మిగా చేసుకోవాలనేది నా లక్ష్యం.

"ముఖ్యంగా మా అక్కల హృదయ విదారక స్థితిని చూసేసరికి నా మనస్సు ద్రవించిపోయేది. మా వదినమ్మ చచ్చిపోయిన మరో ఆర్నెళ్ళల్లోనే మా

అన్నయ్య ఇంకో పెళ్ళాన్ని తెచ్చుకున్నాడు. కానీ, మా అక్కలు జీవితాంతం అల్లాగే ఉండిపోవాలి కదా! సమాజంలో ఆడదానికో నియమం మగవాడికో నియమం ఉండడమనేది నాకు ఎంతమాత్రం నచ్చేది కాదు.

"అందుకే నా కప్పుడప్పుడు అన్పించేది నేనో వితంతువుని పెళ్ళిచేసుకోవాలని. మోడువారిన ఒక స్త్రీ జీవితంలో తిరిగి వసంతాన్ని తీసుకురావాలని నా కోరిక. అక్క లిద్దరూ నన్ను ఈ విషయంలో సమర్థించేవారు. కానీ వాళ్ళకి, నాకు కూడా మా నాన్నతో ఈ విషయం గురించి మాట్లాడడం వీలవలేదు."

"మీ నాన్నతోటి ధైర్యంచేసి మీరు ఎందుకు మాట్లాడలేదు, అనురాగ్? నిజంగా మీ కంత పట్టుదల ఉంటే ఏదో విధంగా మీరు మీ కోరికని సాధించేవారు. నన్నడుగుతే అసలు మీకు దమ్ముల్లేవు."

పెళ్ళయిన ఈ ఏడాదిలో తన తోటి అ విధంగా మాట్లాడడం సంధ్యకి అదే మొదటసారి. తన సంధ్యని తిరిగి మామూలు మనిషిలాగ చేయడానికి తను చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయని మరో సారి అన్పించింది అనురాగ్‌కి.

"కానీ, సంధ్యా! మొదట్నించీ నాకు, మా నాన్నకి మధ్య అంత సఖ్యతలేదని చెప్పాను కదా. ఈ మధ్యే— అంటే పెద్దక్క, చిన్నక్క తిరిగి పుట్టింటికి చేరుకోవడం, మా శాంతమ్మని అ భగవంతుడు తీసికెళ్ళిపోవడం, ఇవన్నీ అయ్యాక అ దేవుడి దయవల్ల మా నాన్నగారికి నామీద కొద్దిగా అనుగ్రహం కలిగింది. అలా కాకుండా మొదట్నించీ ఆయన దగ్గర నాకు చనువు ఉండిఉంటే, నేను ధైర్యంగా నా కోరిక ఆయనకు తెలియచేసేవాడ్నేమో!

"మరి, మీ నాన్నకి నచ్చిన అమ్మాయి మెడలో శాస్త్రోక్తంగా మూడు ముళ్ళు వేసి, పెళ్ళిచేసుకోవచ్చు కదా. మధ్యన నా వెంట ఎందుకు పడ్డారు?"

"అవును, సంధ్యా. అసలు అలాగే జరిగి ఉండాల్సింది. కానీ నేను ఆఫీసు పనిమీద మీ ఊరు రావడం, మా ఫ్రెండ్ వెహికిల్ తీసుకుని సెకండ్‌షో సినిమాకి వెళ్ళడం జరిగింది. ఇంటికి తిరిగివస్తున్నప్పుడు ఒక లారీతో ఘోరమైన ఏక్సిడెంటు జరిగింది. నన్ని హాస్పిటల్లో ఎడ్మిట్ చేశారు. వెంటనే ఆపరేషన్ చెయ్యాలన్నారు. నా శరీరంలోకి ఎంతో రక్తాన్ని ఎక్కించాల్సి ఉంటుందని చెప్పారు డాక్టర్స్. కానీ, నా గ్రూప్‌కి సరిపోయే రక్తం అ హాస్పిటల్లో లేదు."

"అయ్యో, మరి ఆ పరిస్థితిని డాక్టర్స్ ఎలా ఎదుర్కొన్నారు?"

"డాక్టర్స్ వెంటనే ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వారికి నా గురించి టెలిఫోన్ చేశారు. నాకు అయిదారు గంటలలో అపరేషన్ చెయ్యాలని, నాకు అవసర



యువ

మయిన గ్రూప్‌కి సంబంధించిన రక్తం వాళ్ళ హాస్పిటల్లో లేదనీ, అందువల్ల రక్తాన్ని దానం చేయమని ప్రజల్ని కోరుతూ రేడియోలో వెంటనే ఎనౌన్సు మెంటు ఇచ్చారు. మరో అరగంటలో ఓ నూటఏభై మంది తమ రక్తాన్ని ఇవ్వడానికి హాస్పిటల్‌కి వచ్చారు. డాక్టర్స్ ఫైనల్‌గా మీ నాన్నగారి శరీరం నుంచి రక్తం తీసుకుని నాకు ఎక్కించారు. వెంటనే నాకు ఆపరేషన్ అయింది. నేను తిరిగి మామూలు మనిషినయ్యాను.

"నన్ను 'డిశ్చార్జ్' చేశాక, హాస్పిటల్ అధికారుల దగ్గర్నుంచి మీ నాన్న ఎడ్రెస్ తీసుకుని ఆయనకి కృతజ్ఞతలు చెప్పుకునేందుకు కలుసుకున్నాను. మీ నాన్న నన్ను నాకు అభ్యంతరం లేక పోతే నిన్ను పెళ్ళిచేసుకొమ్మన్నారు. ఆ క్షణంలో ఏమయిందో నాకు తెలియదు కానీ, వెంటనే నేను పెళ్ళికి ఒప్పు కున్నాను. ఆ మర్నాడే మన పెళ్ళి రిజిస్ట్రార్ ఆఫీసులో జరిగింది. ఈ విష యాలన్నీ మీ నాన్నగారు నీకు తెలియ కూడదన్నారు. అందుకే ఇన్నాళ్ళూ చెప్ప లేదు. నన్ను క్షమించు, సంధ్యా."

"కానీ, మా నాన్నగారు కూడా మీకు నా కథ చెప్పి ఉండాల్సింది. ఆయన చెప్పలేదు. ఆయన తరపున నేనే మీకు క్షమార్పణ చెప్పుకుంటున్నాను."

"సరే, సంధ్యా! మనలో మనకి క్షమార్పణ లెందుకు! ఇప్పుడు నేను నీ కొక మాట చెప్పాలనుకుంటున్నాను."

"చెప్పండి, అనురాగ్."

"ఇందాక అన్నాను కదా- ఎడారి లాంటి జీవితాన్ని గడుపుతున్న ఒక స్త్రీ జీవితాన్ని తిరిగి పచ్చని పంటచేనుగా మార్చాలని నాకు ఎంతో కోరికగా ఉండే దని. వెంకట్రావుతో పెళ్ళయిందని అనుకుంటున్నావు నువ్వు. ఒక విధంగా అది నిజమే. ఎందుకంటె మానసికంగా అతనితోటి నీకు పెళ్ళయింది. అతగాడి ప్రేమకానుక కొంతకాలం నీ కడుపులో పెరిగింది. ఆయనగారు చనిపోకుండా ఉంటే, మీ రిద్దరూ ఈ పాటికి భార్యా భర్తలయి ఉంటారు.

"అందువల్ల ఒక విధవని పెళ్ళి చేసుకోవాలి అనే నా సంకల్పం నెరవేరిం దని నేను అనుకుంటాను. నీ గతాన్ని మర్చిపో. నన్ను నా జీవిత భాగస్వామిగా స్వీకరించి, నా కన్నీటి జీవితంమీద పన్నీటిజల్లులు కురిపించు."

"అనురాగ్, నిజంగా మీది ఎంత విశాల హృదయం! నా విషయం పూర్తిగా తెలిసి కూడా, మీరు నన్ను భార్యగా స్వీకరిస్తున్నారు. అనురాగంతో మీరు నా జీవితాన్ని అభిషేకిస్తున్నారు. అనురాగానికి సింహాసనం వేసి, నా మీద అనురాగామృతాన్ని కురిపిస్తున్నారు. నేను ఎంతో అదృష్టవంతురాల్ని. రండి, అనురాగ్! వెంటనే ఇంటికి వెళ్దాం. నన్ను నేను మీకు అర్పించుకుంటాను."

సంధ్యా, అనురాగ్ వెంటనే ఆటో ఎక్కి ఇంటికి చేరుకున్నారు.